


## శాఖాహారుల పండగ

ఈ ఫోటోల్లో కనిపిస్తున్నది థాయ్‌లాండ్‌లో జరుగుతున్న 'ఫుకెట్' అనే శాఖాహార పండుగ దృశ్యాలు. శాఖాహారమేమిటి, ఈ రక్తపాతమేమిటి? అంటారా. ఇది థాయ్ ప్రజలు వాళ్ళ దేవతల్ని భూమిపైకి ఆకర్షించే పద్ధతి. ఇలా నాలికల్లోకి, చెంపల్లోకి, శరీరాల్లోకీ కత్తులు గుచ్చుకోవడం, లేదా నిప్పులపై నడవడం ద్వారా దేవతలకు ప్రీతి కలిగించవచ్చని థాయ్ ప్రజలు నమ్ముతారు. అందుకే ప్రతీ యేటా జరిగే ఈ పండుగలో వేల మంది ప్రజలు ఇలా తమని హింసించుకుంటారు. సంవత్సరం సంవత్సరానికీ ఈ పండుగలో హింస మరింత పెరుగుతోంది. మొదట్లో కేవలం ఒక కత్తి దూర్చుకునే వారు. ఇప్పుడు కత్తులతో పాటు అనేక వింత వింత పదార్థాలు శరీరంలోకి గుచ్చుకుంటున్నారు. దేవుని మహిమవల్ల ఎక్కువ రక్తస్రావం కాకుండా, శరీరాలకు సెప్టిక్ కాకుండా ఉంటుందని ఇక్కడి ప్రజల విశ్వాసం. నిజంగానే ఇలా గుచ్చుకోవడం వల్ల జరిగే ప్రమాదాలేవీ డాక్టర్ల జోలికి అంతగా రావట. ఈ పండుగ 1800 సంవత్సరం నుంచి మొదలైంది. ఈ పండుగ జరిగినన్నాళ్ళు ఇక్కడ ఎవ్వరూ మాంసాహారం తినరు, మత్తు పానీయాలు తాగరు, శృంగారంలో పాల్గొనరు, అబద్దాలు చెప్పడం, పక్కవాళ్ళతో దెబ్బలాడటం లాంటివి కూడా చేయరు.

## పొయ్యిలో కర్మకాండ!



ఇటీవల కాలిఫోర్నియా పోలీసులకు ఒళ్ళు గగుర్పొడిచే కేసు ఎదురైంది. మరణించిన తల్లి శవాన్ని ఇంటి పెరడులో ఉన్న బొగ్గుల పొయ్యి మీద కాల్చేసిన ఓ కుటుంబం పోలీసులనే గాక, ఇరుగుపొరుగునీ దిగ్భ్రాంతికి గురిచేసింది. 84 యేళ్ళ అల్లాండ్ అనే ముసలావిడ గత సంవత్సరం డిసెంబర్‌లో సహజంగానే మరణించింది. కానీ ఆమె యాభయ్యేళ్ళ కూతురు కేథలీన్, ముప్పయ్యేళ్ళ మనవడు టోనీ ఆ శవానికి జరిపిన కర్మకాండ మాత్రం సహజంగా లేదు. శవాన్ని మొదట ఒక వారం పాటు అలానే ఉంచేసి, తర్వాత పెరడులో ఉన్న బొగ్గుల పొయ్యి మీద కాల్చేశారు. అప్పటి నుండీ ఆ ముసలావిడ పేరిట వచ్చే రిటైర్‌మెంట్ చెక్కులను మాత్రం ఇద్దరూ కాష్ చేసుకుంటున్నారు. అంతేకాదు, ఆమె కూతురైతే తల్లి కపాలం నుండీ మిగిలిన ఎముకల్తో మెడలో ఒక హారం కూడా చేయించుకుంది. వృద్ధాప్య పింఛను ఆఫీసు వాళ్ళు ఇటీవల పింఛను విషయమై అల్లాండ్‌తో మాట్లాడటానికి ప్రయత్నిస్తే, ఆమె కూతురు కేథలీన్ ఫోన్ ఎత్తి తల్లి గొంతుతో, ఎనభయ్యేళ్ళ వృద్ధురాలిలా మాట్లాడటానికి ప్రయత్నించింది. దాంతో అనుమానం వచ్చి వాళ్ళు పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఈ దారుణం బయటపడింది.

'సరసి' కత

# లోయరు బెర్త్

వైశంపాయనుడు క్యాంపులుజ్జోగం వెలగబెట్టిన రోజుల్లో, రిజర్వేషన్ చేయించుకునేటప్పుడు రైల్లో లోయరు బెర్తే కావాలని పట్టుబట్టి తీసుకునేవాడు. ఎప్పుడైనా కింది బెర్తు దొరక్కపోతే నిద్రపట్టేది కాదతనికి.

ఓసారి బంధువులింట్లో పెళ్ళికని తాడేపల్లి గూడెం వెళ్ళాడు భార్య సుబ్బాయమ్మగారితో కలిసి. తెల్లారితే పెళ్ళి. రాత్రి భోజనాలయ్యేక బంధువులంతా ఎక్కడ చోటు దొరికితే అక్కడ నిద్రపోయారు. వేసవి కావడం చేత కొందరు డాబా ఎక్కి ఆరుబయటే పడకలేశారు, చాపలు, దుప్పట్లు పరుచుకుని.



సుబ్బాయమ్మగారిచ్చిన తలగడ తీసుకొని, డాబా ఎక్కిన వైశంపాయనుడికి ఎంతకీ నిద్రపట్టలేదు.

ఓ రాత్రివేళ కిందకొచ్చి, బంధువుల మధ్య కూర్చుని కబుర్లు చెబుతున్న భార్యని, పిలిచి సమస్య చెప్పుకున్నాడు.

ఓ గసురు గసిరి, ఎక్కణ్ణించో ఓ మడత మంచం సంపాదించి ఇచ్చింది సుబ్బాయమ్మగారు.

డాబా ఎక్కి, ఆ మంచం వాల్చి, దాని కిందకి దూరి పడుకున్నాడు వైశంపాయనుడు. లోయరు బెర్తు మీద పడుకున్న ఫీలింగు కలిగేసరికి హాయిగా నిద్ర పట్టిందతనికి.

*